# మహా శ్రమ

"అమ్మా నీకు ఫోన్. లేవని చెప్పేయనా ?" గ్రైండర్ చప్పుళ్లో కలిపి ఒక గావుకేక.

"ఎవరో కనుక్కో!"

"యు.ఎస్. నించి అమ్మా! అన్నయ్య ఫ్రెండట, లోపలికిస్తున్నా తీసుకో". లోపలికి వెళ్ళి ఫోన్ అందుకున్నా.

"ఎవరండీ? "

"నేను ఆంటీ ! డాక్టర్ వర్మని. రాము స్నేహితుడిని. హ్యూస్టన్‌నించీ మాట్లాడుతున్నా".

నాకొక్కసారిగా గుండె ఝల్లుమంది. "రాము ఎలాగున్నాడు ?" పక్కన నిలబడి మాట్లాడినంత స్పష్టంగా చక్కటిగొంతు వినిపిస్తోంది.

"రాము లాబ్‌లో ఉన్నాడాంటీ! నేను మద్రాసు ఐ.ఐ.టి.లో ఎం.టెక్. అయ్యాక ఇక్కడ స్పెషల్ టైప్ బ్యాటరీ సిస్టమ్స్ మీద డాక్టరేట్ చేసి బెల్ లాబ్స్‌లో పనిచేస్తున్నాను. ఎనిమిది గంటలు దాటితే మీరుండరని చెప్పాడు రాము. అందుకే, నన్ను మాట్లాడేయమన్నాడాంటీ!"

"ఔనయ్యా! పొద్దునపూట కొంచెం తొందరలో ఉంటా. ఇంతకీ ఏమిటి విశేషం" ఈలోపలే, "శారదా! ఆ గ్రైండర్ కట్టేయవే. తరువాత రుబ్బుతాను " అని , "మా గోలింతే. చెప్పండి " అని అడిగా.

"నేను చాలా ముఖ్యమైన విషయం మీతో మాట్లాడాలని కాల్‌చేశాను. మీరు ఒక్క ఐదు నిమిషాలు స్థిమితంగా కూర్చుంటే, మాట్లాడతా" అన్నాడు. అంత మర్యాదగా ఆ పిల్లవాడు అడిగితే కాదనలేక హాల్‌లో సెటిలయ్యా.

"ఆంటీ, నేను పది సంవత్సరాలనించీ యు.ఎస్.లో పన్జేస్తున్నా. మా అమ్మావాళ్ళు బందరులో ఉంటారు.

నా భార్య కూడా ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్. ఇద్దరం డాక్టరేట్ అయ్యాక ఇక్కడ పని చేస్తున్నాం. ఇద్దరికీ చెరో లక్ష డాలర్లు వస్తున్నాయి. పాప హారతికి ఐదేళ్ళు. బాబు భరత్‌కి మూడేళ్ళు."

"గ్రీన్ కార్డ్ ఉందా " - నేనడిగా.

"ఎనిమిదేళ్ళైందాంటీ వచ్చి".

"ఇంక ఏమిటయ్యా నీ ప్రోబ్లెం? అన్నీ బాగానే ఉన్నాయిగా". నేను చేయగల సాయం ఏముంటుం దబ్బా? మామూలు గా ఐతే నేను పెళ్ళి కాని అమెరికా అబ్బాయిలకి సంబంధాలు చూస్తూ ఉంటా. మరి నీకేం సాయం చేయగలను?" కొద్ది క్షణాలు అర్థం కాలేదు.

అవతలినుంచి ఒక్క సన్న నవ్వు వినిపించింది. "మా ఇద్దరికీ కూడా ఇండియా మీద చాలా బెంగగా ఉంటోందాంటీ. వసుధా వాళ్ళ అమ్మా నాన్నా, అంటే అంటే మా అత్తగారు వాళ్ళూ బాగా కలిగిన కుటుంబం. వాళ్ళకు వసుధ ఒక్కతే కూతురు. మమ్మల్ని ఇండియా వచ్చి ఏదైనా ఇండస్ట్రీ పెట్టమని చాలా రోజులుగా అంటున్నారు. ఇక్కడ రెండు మూడు ప్రోడక్ట్స్‌కి మంచి టెక్నాలజీ డెవలప్ చేశాను. వాటికి ఇంటర్నేషనల్‌గా , ముఖ్యంగా యూరోపియన్ మార్కెట్స్‌లో చాలా ప్రోస్పెక్ట్స్ ఉన్నాయి. నా దగ్గర ఆ టెక్నాలజీకి సరిపడా ఫైనాన్స్ కూడా ఉంది. కాబట్టి మన ఊళ్ళోనే ఒక ఇండస్ట్రీ పెట్టాలని ఉందని మొన్న రాముతో నేనంటే, వాడప్పుడు చెప్పాడాంటీ - 'మా అమ్మా నాన్నా కూడా ఐ.ఐ.ఎస్.సి.లో డాక్టరేట్ చేసి హైద్రాబాద్‌లో చిన్న యూనిట్ పెట్టుకుని ఇంకా చిన్నగానే ఉన్నారని'. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇన్నేళ్ళ స్నేహంలో వాడొక్కసారి కూడా మీ యూనిట్ గురించి చెప్పలేదు".

ఇంతలో బల్లమీద పర్సులోంచి ఒక వంద రూపాయలనోటు తీసుకుని "నాకు టిఫిన్‌బాక్స్ వద్దు" అని సంజ్ఞలు చేస్తూ, అదొక్క నోటే ఉందని గోల చేస్తున్నా వినకుండా స్కూటర్ వేసుకుని చిన్నది వెళ్ళి పోయింది. "ఆఁ చెప్పవయ్యా. చెప్పు. వింటున్నా".

"ప్రోజెక్ట్ రిపోర్ట్ కూడా తయారు చేశానండీ ".

"చాలా సంతోషమయ్యా! మీలాంటి టాలెంటెడ్ కుర్రాళ్ళంతా పరాయి దేశానికి సేవ చేస్తున్నారని నేను ఆగస్ట్ 15, జనవరి 26 లాటి పుణ్యతిథుల్లో తగని బాధపడి పోతూంటాను. పోనీలే. మీలో కొందరైనా 'డర్టీ ఇండియా' లో ఏముందని అనకుండా వద్దామనుకుంటున్నారు. కాస్త నయం. కానీ, మీకు మాలాంటి సామాన్యులు చేయగల సాయం ఏముంటుందీ? మేమంతా చిన్న చిన్న యూనిట్స్ పెట్టుకుని చిన్న చిన్న ఆశలతో బ్రతుకుతూ, తెలుగు సినిమాలో హీరోయిన్‌లలా ఇంకా చిన్నవాళ్ళలానే బ్రతికేస్తున్నాం. నువ్వేమీ అనుకోకపోతే, మా టైం ప్రకారం ఆదివారం రాత్రి 10 గంటలకి ఫోన్‌చేయి. అప్పుడన్నీ వివరంగా

మాట్లాడుకుందాం. అప్పుడు టైమంతా నాదే. చాలా ఖాళీగా ఉంటాను".

"సరే కానీ, రాము చెప్పాడాంటీ, అప్పుడు అమ్మ అందరికీ సుత్తి వేసే సమయం. నీకు లైన్ దొరకదని"

"సర్లేవయ్యా! పది పదిన్నరమధ్య ఫోన్ ఎంగేజ్ పెట్టనులే". ఇలాటి వెధవ ఇన్ఫర్మేషన్ అంతా నీకు బాగా ఇచ్చినట్టున్నాడు మావాడు, అనుకుని ఫోన్ పెట్టేశా.

అరే. అపుడే తొమ్మిదైపోయిందే. ఇంకా స్నానమే కాలేదు. కంగారుపడుతూ లేవబోయా. మళ్ళీ ఫోన్.

"ఎవరూ?"

"నేనమ్మా! వాచ్‌మేన్‌ని. యాసిడ్ వచ్చిందమ్మా".

"వస్తే తీసుకో. నేను వచ్చి మునగాలా?"

"కాదమ్మా! రిక్షావాడు 150 అడుగుతున్నాడు".

"ఇప్పటికిప్పుడంటే ఎలాగయ్యా? వాడిని ఆగమను. నేవచ్చి ఇస్తా. ఆఫీసయినా తెరవకుండా డబ్బులంటే ఎలా?"

"పోనీ, నా దగ్గర ఉంది. ఇవ్వమంటారామ్మా!"

"ఆఁ, ఇవ్వు. ఇంక అడగడం ఎందుకు ?" కర్మ. చివరికి వాచ్‌మేన్‌కి కూడా చులకనైపోయాననుకొని నిట్టూర్చి లేస్తున్నా.

ఇంతలోనే మావారు చిద్విలాసంగా సిగిరెట్ పీలుస్తూ, "రెడీయా ?" అనడిగారు. "ఆఁ", "రెడీయే!", "దేనికి?" "అందరి బుర్రలూ పగులగొట్టడానికి!"

"సరేలే నే పోతున్నా, ఫ్యాక్టరీకి. నువ్వు ఆ పనేదో పూర్తిచేసిరా!" అని హడావిడిగా నాలుగు పేపర్లూ, రెండు ఎస్ట్రొలాజికల్ మేగజైన్లూ మడతపెట్టుకుని బుద్ధిగా చంకలో పెట్టుకుని పక్కాయన కారెక్కి వెళ్ళిపోయారు. ఆహా ఈయన ఎంత అదృష్టవంతులు. ఏ గొడవా లేదుకదా. వెడుతూనే తనరూంలో సెటిలైపోయి కాఫీల మీద కాఫీలు తాగుతూ ఏమిటో ఆలోచించుకుంటూ ఉంటారు.ఏమన్నా అంటే, టైంకి ఫ్యాక్టరీకి వెళ్ళడం ఎంత అవసరమో ముప్పావు గంట లెక్చరిస్తారు.

మొత్తానికి చచ్చీ చెడీ తెమిలి, దీపం పెట్టి పూజ అయ్యిందనిపించి, రెండు క్యారియర్లూ సర్ది కారులో పెట్టి, "పద గోవిందూ" అన్నా.

"అమ్మా డీజిల్ !"

"ఇప్పటి దాకా ఏం చేశావయ్యా! నా మొఖం చూస్తేనే అన్నీ గుర్తొస్తాయా. ఆలస్యం అయిపోయిందని అక్కడ అయ్యగారు అరుస్తూ ఉంటారు. ఇంతకీ ఫ్యాక్టరీ వరకూ వెళ్తొచ్చా ?'

"వెళ్ళొచ్చమ్మా !"

"ఆఁ పోనీ, అక్కడికెళ్ళాక పోయించుకో. ఈ లోపల ఆగిపోతే చూద్దాంలే!" అని ఏదో స్తోత్రం చదువు కుంటున్నట్టు నటిస్తూ అనుకున్నా, మళ్ళీ వీడికి ఎక్కడ చెప్పి చచ్చేది, డీజిల్ కని ఉంచుకున్న నోటు చిన్నది ఎగరేసుకు పోయిందని.

నేనెంత ఆలస్యంగా వస్తే అందరికీ అంత పండగ. అందరూ చాలా సేపటి నుంచీ పనిచేస్తున్నట్టు ముఖాలు పెట్టి సీరియస్‌గా ఉన్నారు. టైం చూశాను. పావు తక్కువ పది. నాకు బాగా తెలుసు. వీళ్ళు పని మొదలుపెట్టి ఐదు నిమిషాలు కూడా అయ్యుండదని. సర్లే. పొద్దున్నే ఎందుకు నెగటివ్ థింకింగ్ అనుకొని, నా రూమ్ తాళం తీసి పర్సు అక్కడ పడేసి టీవీ ఆన్ చేసుకుని సోఫాలో కూలబడ్డా. బెల్ నొక్కగానే వచ్చాడు, మాకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆఫీస్ మేనేజర్ కం అసిస్టెంట్ కం అక్కౌంటెంట్ కం టైపిస్ట్ కం నా పి.ఏ.

"ఏమయ్యా రాజూ! ఏమన్నా ఫోన్లు వచ్చాయా ?"

"ఆఁ! ఒక్కటి వచ్చిందమ్మా!"

"ఎక్కడినించి? "

"ఇంటినించమ్మా"

"ఇంతలోనే ఇంటినించి ఫోనేమిటయ్యా ? "

"బోర్ పాడైందిటమ్మా, పెద్దమ్మ గారు చేశారు. ఆలీకి ఫోన్ చెయ్యమన్నారు!"

"ఊఁ! సర్లే !"

నాలో నేననుకున్నా - "ఇవాళ ఏం వారం. శుక్రవారం. ఇంకా రెండు రోజులు గడవాలి. ఇవాళ ఏమీ డిస్పాచెస్ లేవు. కోర్టు కేసులు లేవు. మీటింగులు లేవు. హాయిగా కూర్చుని మొన్న అనుకున్న ప్రాజెక్ట్ రిపోర్ట్ కంప్లీట్ చేస్తా. మంచి మూడ్ వచ్చింది. సరిగ్గా బుర్ర పనిచేయాలే కానీ, ఎంత సేపు. అది రాసి ఆడిటర్ గారికిచ్చేస్తే, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ కలిపి బ్యాంక్‌కిచ్చేయచ్చు".

ఇంతలోనే బయట గోల. పోయి చూస్తే, సైకిలు దగ్గర ఒకడు కాకీ బట్టలు వేసుకుని అరుస్తున్నాడు. "ఫ్యూజులు తియ్యనియ్యకపోతే, పోల్ ఎక్కి తీసేస్తానంటూ". నేను వెళ్ళి "రాజూ! ఏంటి గొడవా!" అని అడిగాను.

"కరెంటు వాళ్ళటమ్మా! ఫ్యూజులు తీసుకెళతారట! "

"ఎందుకూ? మొన్న చెక్కు వెనక్కి వస్తే, డిడి కట్టేశాంగా!"

"అది కట్టామమ్మా! కానీ మళ్ళీ కొత్త డిపాజిట్ 30 రోజుల లోపు కట్టాలని నోటీస్ ఇచ్చారు గదమ్మా!"

"ఔను. కానీ దానికి ముప్పై లాస్ట్ డేట్ గా. అపుడే ఫ్యూజులు తీసేయడమేమిటీ?"

"రేపు సెలవుటమ్మా! అందుకని!"

ఓ.అదా, ఉండు. "ఏమయ్యా! మాకు 30 దాకా టైముంది కదా. డిపాజిట్ కోసం కూడా ఫ్యూజులు తీసికెళ్ళి పోతారా ?"

"మాకేం తెలుసండీ! మా ఏఇ గార్నడగండి. నాకీ కాగితం ఇచ్చి, అన్ని ఫ్యూజులు తీసేయమన్నా రండీ !"

"సరే. మీ ఏఇ గారి నెంబర్ చెప్పు. నే మాట్లాడతా !"

"ఆరు లేరండీ. అక్కడెక్కడో ట్రాన్స్ఫర్మర్ పోయిందంటే వెళ్ళారు".

"ఇదిగో అబ్బాయ్. నీవు ఒంటిగంటకు రా. అప్పటికి డిపాజిట్ చెల్లించి రశీదు చూపిస్తా!". ఐనా, బిల్లు లేవీ పెండింగ్ లేనపుడు డిపాజిట్‌కి ఇంత గోలేమిటి ?

"మాకేం తెలుసండీ! మా ఏఇ గార్నడగండి !"

"మీ ఏఇ లేరన్నావు కదయ్యా? "

"మీరు కట్టేసి రశీదు అట్టుకురండి. నేను రెండు గంటలకి వచ్చి కనెక్షనిస్తాను.

"మరి ఇవాళ పని ఎలా జరుగుతుందయ్యా? మీ బాబు వచ్చి చేస్తాడా?"

"ఏమండోయ్ మాటలు సరిగ్గా రానివ్వండి!"

"సర్లే . నువ్వు ఫ్యూజులు తియ్యి. నేను పోలీసులకి ఫోన్ చేస్తా. మరీ ఇంత అరాచకమా?"

ఇంతలో ఓ కొత్త హీరోహోండా మీద తళతళలాడుతూ ఓ కుర్ర ఏఇ గారొచ్చారు.

ఆ కాకీ శాల్తీ, "చూడండి సార్. ఈ అమ్మ పోలీసులని పిలుస్తాదట!" అన్నాడు.

"ఔను సార్. ముప్పై లాస్ట్ డేటంటే, ఇరవైతొమ్మిది పొద్దున్నే కరెంటు పీకేస్తానంటాడేమిటీ!"

"లేదమ్మా. రేపు సెలవు గదా!"

"రేపు సెలవైతే ఎల్లుండి రండి !" నా మొఖం చూసి ఏమనుకున్నాడో ఏమో, " పోనీ, చెక్కు ఇచ్చె యండి. మంగళవారం కలెక్షన్‌కి వస్తుంది!" అన్నాడు. హమ్మయ్య అనుకుని విజయగర్వంతో లోపలికి నడవబోయా.

"అమ్మా!" కాకీ వాడి పిలపు . "ఛాయ్ పైసలు!"

"ఫ్యూజులు పీకడానికి ఈసారి వచ్చినపుడు టిఫిన్ కూడా చేసి పెడతాలే. ఈసారికి వెళ్ళిరా!" అని

లోపలి కెళ్ళి, "లక్ష్మీ కాఫీ తీసుకురా!" అని ఒక్క అరుపు అరిచి గడియారం వంక చూశా. అప్పుడే పదకొండు గంటలు.

"పోస్టాఫీస్ కి వెళ్ళినవాళ్ళు తిరిగి వచ్చారా? "

రెడ్డి వెళ్ళాడమ్మా. ఇంకా రాలేదు. అప్పుడే ఎందుకొస్తాడూ. పోస్ట్‌మేన్ మా వీధి చేరడానికి అరగంట ముందు చేరతాడు. ఇంతలో మా సూపర్‌వైజర్ రత్న వచ్చింది. " మేడమ్ రెండు ఫేస్‌లే వస్తున్నాయి. ఫర్నెస్ ఆపేయనా? "

"ఎప్పటినించీ?"

"ఇప్పుడే మేడం!"

"ఆపెయ్యండి!" "ఎక్కడన్నా తాళాలున్నాయేమో చూడు!"

"ఇప్పుడే ఎందుకు మేడం తాళాలు"

"భజన చేయడానికి!" ఖర్మ. ఈ కాలం పిల్లలకు తెలుగు అర్థమై చావదు. నాకేసి అదోలా చూసి వెళ్ళి పోయింది. ఛ. కరెంటు వాడితో నా మూడంతా పాడైపోయింది. ఈపాటి రెండు ఫేసుల కరెంటుకి పీకేస్తానని బెదిరింపు. పీకెయ్యమనాల్సింది. ఇంతలో కరెంటు పోయింది. చిమ్మ చీకటి. ఈ వాస్తు పేరు చెప్పి, అన్ని కిటికీలూ, తలుపులూ ఇటికలతో మూసేసి, ఈశాన్యం వేపు మాత్రం చిన్న తలుపు పెట్టాం. కలిసిరావడం మాటేమో గానీ, కరెంటుపోతే, ఒకళ్ళకొకళ్ళం కనపడం.

"రెడ్డీ! జనరేటర్ ఆన్‌చేయి!"

"డీజిల్ ఐపోయిందమ్మా!"

"అదేమిటి? నిన్న సాయంత్రం పది లీటర్లు తెప్పించాంగా?"

"ఇప్పుడే బాబు కారులో పోసుకుని అర్జెంటు పనుందని వెళ్ళిపోయారమ్మా!"

"సర్లే ! కరెంటు ఆఫీసుకి ఫోన్ చేయి".

ఐదు నిమిషాల్లో కరెంటు వచ్చింది. "ఆహా కరెంటు దేవత వచ్చింది. హారతిచ్చి పని మొదలెట్టండి". ఇంతలోనే రత్న సంతోషంగా వచ్చింది "మూడు ఫేసులూ వస్తున్నాయి మేడమ్!"

"ఏ.ఇ. గార్కి ఫోన్ చేసి పార్టీ అడుగుదాంలే. వెళ్ళి ఆ పని సంగతి చూడు!" ఇంతలోనే ఎవరో లూనా దిగుతున్నారు. నాకు కంగారు పట్టుకుంది. "చూడు రాజూ, ఎవరో? "

"కంగారు లేదమ్మా. కొరియర్ వాడు. రాజమండ్రి నించి డబ్బు పంపానని నిన్న ఫోన్ చేశాడు కదమ్మా లక్ష్మీపతి?"

"మరి నాకెందుకు చెప్పలేదు?"

"చెబితే తిడతారని చెప్పలేదమ్మా!"

"డబ్బు పంపిస్తే ఎందుకు తిడతానయ్యా?"

"కాదమ్మా, మరి ఇరవై వేలు వసూలయ్యాయట. ఆళ్ళ జీతాలు పోనూ 16వేలకి డి.డి. తీద్దామనుకున్నాడట. జీప్ ఫెయిలయ్యి రెండు వేలు ఖర్చయ్యింది. ఇంక పన్నెండు వేలు పంపిస్తున్నాను, రెండువేలు చేతి ఖర్చుకుంచుకుని. నువ్వు ఇవన్నీ అమ్మగారికి చెప్పకు. నేను ఉత్తరంలో రాత్తాలే!" అని చెప్పాడండి.

ఉత్తరం చదివా. "మేడంగారికి నమస్కారములు. పన్నెండువేలకు డి.డి. పంపుతున్నాను. మిగతాదానికి పండగెళ్ళాక రమ్మన్నారు".

ఏ పండగో రాయడేం. ఈ సరుకిచ్చి ఇప్పటికి ఆరు పండగలెళ్ళిపోయాయి. ఎంత వసూలైందో లేదు. ఎంత ఖర్చైందో లేదు. "మన ప్రోడక్ట్స్ చాలా బావున్నాయని అందరూ అంటూన్నారు.(ఎవరూ, వీళ్ళింటో వాళ్ళా). కానీ, టీవీలో ఎడ్వర్టైజ్‌మెంట్ ఇస్తే బావుంటుందని అంటున్నారు. మళ్ళీవారం కొంత పంపగలను. తప్పులుంటే క్షమించగలరు - ఇట్లు లక్ష్మీపతి".

వీడి అసాధ్యంగూలా. తప్పులుంటే క్షమించమంటాడేమిటీ ఏం తప్పులు చేస్తున్నాడో ఏమిటో.

"పి.ఎస్.: మొన్న బోస్‌గారు 30శాతం డిస్కౌంట్ ఇస్తే పెద్ద ఆర్డర్ పెడతామన్నారు. ఇవ్వమంటారా. కిందటేడాది మార్చిలో ఇచ్చిన దాని పేమెంటు వచ్చే వారం ఇస్తామన్నారు. గమనించగలరు. సృష్టి కంపెనీ వాళ్ళు డీలర్లందరికీ శాంతిభవన్‌లో డిన్నరిచ్చి బ్రీఫ్‌కేసులు గిఫ్ట్ ఇచ్చారు. మన కంపెనీ కూడా ఏదైనా ఇస్తే బావుంటుంది. సార్‌తో ఆలోచించండి. తప్పులుంటే క్షమించండి ".

రాజుని కేకేసి, "ఇదిగో డిపాజిట్ చేసి 12 వేలకి పిఎఫ్ డిడి తీసుకోవయ్యా. మొన్న నోటీస్ వచ్చింది కదా. 30 రోజుల లోపల కట్టకపోతే, ప్రాసిక్యూషన్ అని". 'సరేనమ్మా' అని వెళ్ళిన రాజూ తిరుగు టపాలో వచ్చాడు.

"ఏమైందీ, మన బ్యాంక్‌లో పని అంత తొందరగా అయిపోయిందా ?"

"లేదమ్మా, డిపాజిట్ చేశాక ఆఫీసరు గారు చెప్పారు. మొన్న ఇన్స్యూరెన్స్ డెబిట్ చేశారటమ్మా. మన అకౌంట్ ఇర్రెగ్యులర్‌గా ఉందిట, ఈ చెక్ పోనూ 14వేలు తెమ్మన్నారు".

"మరి నువ్వు చెప్పావా, పి.ఎఫ్. కట్టకపోతే చాలా ప్రమాదమనీ!"

"చెప్పానమ్మా, అలాటిదేమన్నా ఉంటే మేడమ్‌గారిని రమ్మను. నువ్వు వస్తే ఎలా అన్నారు". నేను పైకెళ్ళి ఫోన్ చేశా. "ఏమిటి సార్. కొంత డిపాజిట్ చేశాం కదా. పి.ఎఫ్. చాలా ప్రోబ్లెంగా ఉంది. కట్టకపోతే

చాలా కష్టం. మీరిదొక్క టైనా ఒప్పుకోవాలి".

"నాకు పవర్స్ లేవు మేడమ్".

"పోనీ, సీ.ఎం.గారున్నారా ?"

"లేరండీ, గౌహతి ట్రైనింగ్‌కి వెళ్ళారు".

"ఎన్నాళ్ళండీ ?"

"పధిహేను రోజులు".

"మరి మేనేజర్‌గారున్నారా?"

"లేరండీ, హెడ్డాఫీస్‌కెళ్ళారు".

"మరి ఎలాగండీ ?"

"మీరు ముందు ప్లాన్ చేసుకోవాలమ్మా, ఆఖరి నిమిషంలో వచ్చి మమ్మల్ని అడిగితే ఎలా మీ లిమిట్స్‌లో మీరు అకౌంట్స్ నడపలేకపోతున్నారు. మేమసలు లిమిట్స్ తగ్గించేద్దామనుకుంటున్నాం. మీ టర్నోవర్సూ తగ్గిపోయాయి".

"కాదు సార్, మాకు రావలసినవి చూడండి. పద్దెనిమిది లక్షల వరకూ ఉన్నాయి. మేం తీసుకుంది పది లక్షలే గదా ?"

"కాదండీ, పది లక్షల పద్నాలుగు వేలు".

"పధ్నాలుగు వేలకి ఎక్కడికి పోతామండీ, ఇది ఒక్కటీ పాస్ చేయండి. మళ్ళీ వారంలో ఒకటిన్నర పేమెంట్ వస్తుంది!" అన్నా.

"సర్లెండి. పంపండి" అని ఠక్కున ఫోన్ పెట్టేశాడు. అక్కడికే సంతోషించి, "రాజూ, పరుగెత్తు. రమ్మన్నారు" అని చెప్పి మళ్ళీ పనిలో పడ్డా. కాసేపటికి రాజు గంటులా ముఖం పెట్టుకుని వచ్చాడు.

"ఏమిటయ్యింది మళ్ళీ?"

"అమ్మా, మీరు తిట్టనంటే చెబుతా. నిన్న మీరు గుంటూరు పంపమన్న 100కిలోలు రాజమండ్రి పంపానమ్మా !"

"అదేమిటయ్యా, అలా ఎలా జరిగిందీ?"

"నేను రాసుకునేపుడు పొరబాటుగా రాసుకున్నానమ్మా. సాయంత్రం ఏడైపోయింది కదమ్మా, బుక్ చేసేప్పటికి ?"

"సర్లే. ఒకసారి ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌కి వెళ్ళి చూడు. అదృష్టం బావుంటే ఇంకా అక్కడే ఉండి ఉండచ్చు".

పావుగంటలో మహదానందంగా వచ్చాడు. "అమ్మా, మనం చాలా అదృష్టవంతులం. ఇంకా లోడ్ కాలేదు. కరెక్ట్ చేసి వచ్చేశానమ్మా".

"ఇదిగో రాజూ, ఇంకోసారి ఇలా జరిగితే నేనూరుకోను. బుర్రలెక్కడ పెట్టి వస్తారయ్యా ఒక్క పనీ సవ్యంగా చేయలేరు!" అప్పటికే లంచ్ టైమైంది. అందరూ భోజనాలకి కూర్చున్నారు. ఈయనకి వడ్డించి నేనూ కూర్చున్నా. ఇంతలోకే రాజు మళ్ళీ ఊడిపడ్డాడు.

"ఏం పుట్టి మునిగిందయ్యా మహానుభావా?"

"ఏసిటివో గారొచ్చారమ్మా!"

"ఎందుకయ్యా, రిటర్న్స్ ఇచ్చాంగా?"

"కానీ డబ్బు కట్టలేదు కదమ్మా?"

"సర్లే. తన ముందు ఎందుకు మాటలని, మీరు తినెయ్యండని" చెప్పి ఆఫీసులోకి వెళ్ళాను.

"నమస్తే మేడం బావున్నారా. చిన్న అమౌంటు డ్యూ మేడం!"

"ఎంత?"

"డెబ్భై వేలు!"

"అబ్బా, అంత సేల్స్ ఐందా?" అని ఒక్క క్షణం గర్వపడ్డాను. "మొన్న మీరు రిటర్న్స్ ఫైల్ చెయ్యండి డబ్బు తర్వాత కట్టొచ్చన్నారు గదండీ, మొన్న బిల్‌చేస్తే ఈవేళ డబ్బులెక్కడనుంచి వస్తాయి?"

"ఔననుకోండి. కానీ మా ఆఫీసర్‌గారు డ్యూస్ అన్నీ 30లోపల కలెక్షన్ చెయ్యమన్నారు"

"మేం ఎక్కడనించి తేం సార్!, బిల్ చేసిన 3, 4 నెలలకు కానీ మాకు డబ్బులు రావు కదా?"

"మీరు కట్టక్కరలేదండీ. చెక్కులు ఇస్తే చాలు!"

"ఎలాగియ్యం, అన్నీ బ్యాంకునించి తిరిగి వెడతాయి గదా ?"

"అవకుండా చూసుకోండి. మూడురోజులు టైం ఉంది కదా ?"

నేనన్నాను "పోనీ పదో తారీఖు వేసి ఇస్తాను. మాకు పన్నెండుకెల్లా కొంత పేమెంట్స్ వస్తాయి!"

"కుదరదండీ. మీకు డబ్బులొచ్చినా రాకపోయినా మా డ్యూటీ మేం చెయ్యాలి కదా మేడం ?"

"ఔనులెండి. చెక్ తిరిగి వెళితే మా బ్యాంక్ వాళ్ళు కోప్పడుతున్నారయ్యా! డబ్బులు లేనపుడు ఎందుకు చెక్కులిస్తారని?" ఇంక వాళ్ళకి సమాధానం చెప్పే ఓపిక లేకపోయింది. రెండు చెక్కులు ఇచ్చి మా రూంకి వచ్చి భోజనం అయిందనిపించా.

వార్తలు వస్తున్నాయి హిందీలో. లఘు ఉద్యోగ్ దేశానికి వెన్నెముకట. వీరు - ప్రభుత్వం వారు. ఎన్నెన్నో

రాయితీలిస్తారట. ఆర్థిక మంత్రి ఉవాచ. ఆలోచిస్తున్నా. - ఏం రాయితీలిస్తున్నారబ్బా నాకేమీ అనుభవంలోకి రావడం లేదే. 3 కోట్ల పెట్టుబడి వరకూ చిన్న పరిశ్రమగా గుర్తించారట. మహా బాగు. దీనివల్ల మాకేమిటి లాభం? వడ్డీరేటు ఒక్క శాతం కూడా తగ్గించరు కదా. యూనిట్ మూతపడిపోతున్నా కాంపౌండింగ్ మానరు కదా? వర్కింగ్ క్యాపిటల్‌కి కలపక మానరు కదా. అరిచి గీ పెట్టినా, నన్ను కప్పెట్టేంత స్టాక్స్, మా ఎస్టేట్ అంతా కొనేంత బిల్ పెండింగ్ ఉన్నా ఒక్క పదివేలకోసం ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ముష్టివాళ్ళలాగా తిరగాల్సిందే కదా. మాకు ఇవ్వాల్సిన వాళ్ళు మాట్లాడరు. మేము ఇవ్వాల్సిన వాళ్ళు నిలబడరు. ఈ చిన్న యూనిట్లన్నీ - " లేని వాళ్ళింట్లో చివరి ఆడపిల్లగా పుట్టి, అంత కన్నా దరిద్రుల కొంపకి పెద్ద కోడలిగా వెళ్ళినట్టు ఉన్నాయి". పైగా, ఈ నాయకమ్మన్యులందరికీ, ఎంతో నచ్చిన ఊత పదాలు "చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి, మహిళాభ్యుదయం" వగైరా వగైరా. ఇన్ని బలహీనతలు కలిస్తే, ఒక్క గొప్ప శక్తి తయారౌ తుందని ప్రభుత్వం వాళ్ళ ఆశో, ఏం పాడో ?

ఇంతలోనే మా ఫ్రెండ్స్ ఆరుగురొచ్చారు. అందరికీ తలో చిన్న యూనిట్ ఉంది. ఇక్కడికి వచ్చిన కొత్తలో అందరూ ఎంత దర్జాగా , ఉత్సాహంగా ఉండేవాళ్ళో. ఇపుడు అందరి జుట్లూ తెల్లబడిపోయాయి. అప్పుడు అందరూ పెద్ద పెద్ద ఉద్యోగాలు మానేసి వచ్చినవాళ్ళే . ఇప్పటికీ కొందరు స్కూటర్లెక్కే తిరుగుతున్నారు. "మేడం రేపు మన అసోసియేషన్ హాల్లో మీటింగ్ ఉంది. 'చిన్న తరహా పరిశ్రమలు - సమస్యలు'. మన మినిష్టర్‌గారు వస్తున్నారు. మన అసోసియేషన్ గురించి, మన సమస్యలగురించి సమాచారమడిగారు.

"మన సమస్యలు వాళ్ళకి తెలియవుటండీ!"

"తెలియకేం, కానీ మన సలహాలకీ కొంత విలువ ఉంటుంది కదా!"

"ఇలా మనతో చర్చించామంటే, అవతలవారికి పరపతి పెరుగుతుందేమో గానీ, మనకి ఒరిగేదే ముంటుందీ?"

"అలా అంటున్నారేమిటి. మీరే ఇలా డీలాపడిపోతే ఎలా? మనమే కదా రాబోయే తరాలకి ఆదర్శం!"

"సర్లెండి! మనలాటి వాళ్ళని ఆదర్శంగా తీసుకుంటే ఇంక దేశంలో ఒక్క ఇండస్ట్రీ రాదు".

"ఔను! ఎంతసేపూ కోట్లు సంపాదించినవాళ్ళ గురించే చెప్తారు కానీ, ఇలా మనలా విజయమో వీర స్వర్గమో అని తెగించి పోరాడే వాళ్ళ ని ఎవరూ గుర్తించరేమిటండీ?"

"ఆ! మనకన్నీ మరణానంతరం అవార్డులే ఇస్తారులే! సుబ్రహ్మణ్యం గారూ, ఏమయింది ఇంతకీ మీ బ్యాంక్ అప్లికేషన్ ?"

"ఏమీ కాలేదండీ! వేరే కోలేటరల్ సెక్యూరిటీ అడుగుతున్నారు. ఇచ్చిన అప్పుకి మూడురెట్ల పట్నపు

ఆస్తి తనఖా పెట్టాలట".

"అవన్నీ ఉంటే, మనం కూడా బ్యాంక్ వాళ్ళ లాగా కాలు మీద కాలు వేసుకుని హాయిగా కూర్చుని యూనిట్లు ఎలా నడపాలో సలహాలిచ్చే వాళ్ళంగా!"

"ఇవన్నీ మాట్లాడడానికైనా మీరు తప్పక రావాలి".

"ఏమనుకోకండి. నేను వస్తే మీ పనులు కావు.. మళ్ళీ మీరే నన్ను తిట్టుకుంటారు" అని చెప్పి వచ్చిన అతిథుల్ని మర్యాదచేసి "నెల మూడు వానలు కురియుచున్నవా మంత్రీ, కురియుచున్నవి అంటే కురియుచున్నవి రాజా కురియుచున్నవీ అని పాడి పంపేయండి" అన్నాను. అందరూ తలా ఓ కప్పు కాఫీ తాగి వెళ్ళిపోయారు .

ఇంతలోనే ఫోన్ ట్రింగ్‌మన్నది. "ఏంటి రాజూ ?"

"మీకు ఫోనమ్మా, వీరాస్వామిగారట"

"ఏం చెప్పావు?"

"చూసి చెబుతానన్నానమ్మా"

"ఏంటి చూస్తానన్నావు మనది సెక్రటేరియట్టా. నేనున్నదీ లేనిదీ తెలియకపోవడానికి ఇవ్వు".

"నమస్కారం స్వామిగారూ! ఔనండీ, రెండు నెలలనించీ పంపలేకపోయాను. గురువారం నాటికి పంపి స్తాను."

"ఔను. అసలు ఇచ్చేస్తానన్నాను. కానీ ఇంకా ఏమీ చేయి తిరగడం లేదండీ కనీసం నవంబరైనా వచ్చేట్టుంది". "మీరెవరినీ పంపక్కరలేదు. నేనే పంపిస్తా. ఉంటా".

నిజంగా మనుష్యుల్లో దేవతలుంటారంటే, ఇదివరలో నమ్మేదాన్ని కాదు. కానీ నన్ను నమ్మి నాకు డబ్బి చ్చిన వాళ్ళలో అంతో, ఇంతో ఆ అంశ ఉండేదనిపిస్తుంది. ఇంతలో పక్క ఫ్యాక్టరీ వాళ్ళ అబ్బాయి వచ్చాడు.

"ఆంటీ, డాడీ అడగమన్నారు. రెండు వేలున్నాయేమోనని".

"నా దగ్గరేం లేదయ్యా. ఏమిటంత అర్జెంటు ?"

"మళ్ళీ చెప్తానాంటీ!" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. వాళ్ళకీ, మాకూ 20 ఏళ్ళుగా స్నేహం. అప్పట్లో ఆయన హెచ్.ఎం.టి. లో సీనియర్ మేనేజర్‌గా ఉండేవాడు. ఉద్యోగం మానేసి ఈ యూనిట్ పెట్టుకున్నాడు. తిండికీ, బట్టకూ లోటు లేదు. కానీ, అదే ధ్యేయం అయితే ఇన్ని బాధలెందుకు? ఇంత శ్రమ ఎందుకు?

ఇహ సాయంత్రం అయిపోతోంది. పిల్లంతా అలసిపోయినట్టయి పోయారు. ఒక్కొక్కరినే పిలిచి పని అప్ప జెప్పుకుని రూమ్‌తాళాలు వేసుకుని బయలుదేరేసరికి ఆరు గంటలయింది.

ఇంతలోకే, అత్తగారి ఫోన్. "అమ్మాయీ! కావలినించి సుగుణా, పిల్లలూ వచ్చారు. వచ్చేటపుడు కాఫీపొడి, ఒక లీటర్ పెరుగు తీసుకు రా".

"ఎప్పుడు అడ్మిషన్స్?"

"మంగళవారంట".

మరి ఇప్పట్నుంచే ఎందుకు వచ్చారబ్బా? సర్లె. ఆవిడను ఎందుకు ఇబ్బంది పెట్టడం. ఏభై ఏళ్ళు వచ్చినా నేనింకా మా అత్తగారికి అమ్మాయినే ! వచ్చేటప్పటికి నవ్వుతూ ఎదురొచ్చింది సుగుణ."వదినా! నీకో సర్ప్రైజ్. నేను వంట పూర్తి చేసేశా!"

చెప్పొద్దూ. నాకా పిల్లని ముద్దెట్టుకోవాలనిపించింది. "చాలా థాంక్స్ సుగుణా. ఐనా, నేను చేసే దాన్ని గా". ఒక్క నిమిషం నడుంవాల్చి పడుకున్నా. మగత. నిద్దట్లో చిన్న కల. గబుక్కున ఎవరో కొట్టినట్టు మెలకువ వచ్చింది. మా అమ్మ ఎందుకు అన్ని నీతులు నూరిపోసిందో. "సంజ నిద్దురపోతే దద్దిరంబు వచ్చును దానన్" కుమారీ శతకం గుర్తొచ్చి ఠక్కున లేచి కూర్చున్నాను.

రాత్రి భోజనాల దగ్గర ఈయన అడిగారు. "పొద్దున ఫోన్ ఎవరిది. రామూ గాడేనా? ఎలా ఉందిట? వాడి ప్రోజెక్ట్". పొరబాట్నయినా పిల్లవాడెలా ఉన్నాడని అడగరు కదా.

"రాము కాదు వాడి ఫ్రెండ్ వర్మట. మనవూరొచ్చి ఏదైనా ఇండస్ట్రీ పెట్టి దేశాన్ని ఉద్ధరించాలని కలలు కంటున్నాడు. నా సలహా కోసం ఫోన్ చేశాడు".

"హూః! నీ సలహా అడిగితే దిబ్బరొట్టె ఖాయం అన్నట్టు ఉంటుంది".

"ఫర్వాలేదు లెండి. మన సంగతి తెలిసే రాము నా సలహా అడగమన్నాడు. మీది కాదు. "మనం బెంగుళూరులోనే ఉండుంటే ఈ పాటికి 20 పబ్లికేషన్లూ, ఐదారు ఫారిన్ ట్రిప్పులూ ఐనా ఉండి ఉండేవి". మన ఫ్రెండ్సంతా చూడండి. ఎంచక్కా ఫ్రిజ్‌లో పెట్టిన కూరల్లా, వాడకుండా ఎండకుండా ఉన్నారు".

"ఏమే అమ్మా, నీ బెంగుళూరు ఫ్రెండ్సే అలా ఉంటే, అమెరికా ఫ్రెండ్స్ ఎలా ఉన్నారే?"

"ఆః. ముక్క నూనె సరిపోయిందో లేదో అని వారం తర్వాత కొత్త ఆవకాయ జాడీ మూత తీస్తాం చూడు. అలా ఘుమ ఘుమలాడుతున్నారు".

"అమ్మకెప్పుడూ తిండి రంధే నాన్నా". "మరి మీరెలా ఉన్నారే?"

"మూడెండలు ఎండిన మాగాయ ముక్కల్లా ఉన్నాం. సరేనా ?"

"నువ్వేమీ అలా లేవు. గుత్తి మామిడి కాయలా ఉన్నావ్. పాపం నాన్నే అలా ఉన్నారు."

"పోనీలే! మీనాన్న చాలా మంచివారు. నేనే రాక్షసిని". ఇద్దరూ గుసగుసలాడుకుని నవ్వుకున్నారు.

"ఏం చేస్తాం? ఈ సమస్యలన్నీ మనకొక్కళ్ళకేనా ఏమిటి? అంతా గ్లోబల్ ఫినామినా. అందుకే రోజూ అన్ని పేపర్లూ క్షుణ్ణంగా చదవమంటాను".

"ఆరు పేపర్లు కంఠతా పట్టడం తప్ప నాకు వేరే పనులేమీ లేవా ? మీకంటే కుదురుతుంది!"

రాత్రి పదిన్నరకి రాము ఫోన్ - "అమ్మా! వర్మని మళ్ళీ చేయమన్నావట".

"అవున్రా. నీకు మనదేశంలో పరిస్థితులు బాగా తెలుసుగా - పిల్ల నచ్చిందన్న తర్వాత ఆడపెళ్ళివారి ప్రవర్తనలా ఉంటుందిక్కడ వాతావరణం. ఒకసారి తలదూర్చే వరకే ఎవరి సహాయమైనా, గౌరవాలైనా. ఆ తర్వాత మన పాట్లు మనకి తప్పవు. యూనిట్ చిన్నదైనా, పెద్దదైనా సమస్యలు ఇంచుమించు ఒక్కటే".

"నేనేమో అబద్ధాలాడి లేనిపోని రంగుల వాతావరణం సృష్టించలేను. నిజం చెప్పి ఎవరినీ నిరుత్సాహ పరచలేను. మంచి టెక్నోక్రాట్ అయి, డబ్బున్నంత మాత్రాన ఇండస్ట్రీ బాగా నడపగలననుకోవడం భ్రమ. అతనిలో నలుగురిని కలుపుకుపోగల మనస్తత్వం , జీవితం మీద బోలెడు ఆశ, ఏదో సాధించాలనే తపనా, తన ప్రోడక్ట్ మీద ఎంతో నమ్మకం, ప్రేమ, అవమానాలని లెక్కజేయని ధైర్యం, నాలుగు తన్నులు తినో, తన్నో పని చేసుకురాగల నేర్పూ, ఒకవేళ అన్నీ పోయినా బతకగలమనే విశ్వాసమూ ఉంటే ఇక్కడికి రమ్మను. అంతే గానీ, డబ్బుందిగదా అనీ, మంచి ప్రోడక్ట్ ఉంది కదా అనీ, డబ్బున్న అత్తగారున్నారు కదా అనీ కాదు. ఇవేవీ మనదేశంలో ఇండస్ట్రీ నడిపేందుకు పనికిరావు. ఈ లక్షణాలు ఆ మనిషిలో ఉన్నాయనిపిస్తే రమ్మను. ఆఁ, అన్నట్టు ఒకవేళ రాదల్చుకుంటే అదే ఫీల్డ్‌లో ఉన్న పెద్ద ఇండియన్ బిజినెస్ హౌస్‌తో కలవమను. అప్పుడే సుమారైన ప్రాజెక్టులు బాగా నడుస్తాయి. చాలా పనులు మీ వల్ల కావు. ఇవన్నీ చెబితే అతనేమనుకుంటాడో అని మళ్ళీ ఫోన్ చెయ్యమన్నా!"

"సర్లేవే. నేను చెప్తా. ఆలోచించుకోమంటా. ఉంటా - బై!"

పడుకునేటపుడు ఈయన అంటున్నారు "ఎందుకలా ఊరికే కంగారు పడతావు డిసెంబర్ 16 నించీ నీకు చాలా బావుంటుంది".

"హుఁ! పాతికేళ్ళ నుంచి వింటున్నా ఈ మాట. ఏం. అప్పుడు గురుడు 11వ ఇంట ఉంటాడా?"

ఏదో ఒకటి చెప్పకపోతే తెల్లవార్లూ నేను పచార్లు చేస్తూనే వుంటాగా మరీ!! దీన్ని చిన్న పరిశ్రమ అంటారా! మహాశ్రమ అయితేనూ!